పోరు గ్రామాల్లో కనిపించని 'పల్లె వెలుగు'

- ఇబ్బందుల్లో 12 గ్రామాల ప్రజలు
- పట్టించుకోని ఆర్టీసీ అధికారులు
- అధిక చార్జీలు వసూలు చేస్తున్న ప్రైవేట్ వాహన యజమానులు



జోడేఘాట్‌కు వెళ్లే తారురోడ్డు



జీపు టాప్‌పై ప్రమాదకరంగా వెళ్తున్న జోడేఘాట్ గ్రామస్తులు

కెరమెరి: గతంలో జల్, జంగల్, జమీన్ అంటూ పోరాటం చేసిన గ్రామాలు నేడు పల్లె వెలుగు కోసం ఎదురు చూస్తున్నాయి. కోవిడ్ మహమ్మారి నేపథ్యంలో 2019లో బస్సు రద్దు కాగా మళ్లీ ఆర్టీసీ అధికారులు పునరుద్ధరించకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ప్రతీరోజు ఉదయం, సాయంత్రం రెండు ట్రిప్పులు బస్సులను నడిపేవారు. కాని ప్రస్తుతం అధికారులు బస్సు నడిపే ఆలోచన కూడా చేయడం లేదు. పలుమార్లు బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేకుండా పోయింది. మెట్టగూడ నుంచి జోడేఘాట్ వరకు మొత్తం 12 గ్రామాలు ఉండగా, 1634కి పైగా జనాభా ఉంది.

అధిక చార్జీలు వసూలు..

జోడేఘాట్ నుంచి కెరమెరి వరకు కేవలం 21 కిలోమీటర్ల దూరం ఉంది. బస్సు చార్జి రూ.28లుగా ఉండగా ప్రైవేటు వాహన యజమానులు అధికంగా చార్జీలు వసూలు చేస్తున్నారు. ఒక్కో ప్రయాణికుడి నుంచి రూ. 50 వసూలు చేస్తున్నారు. బస్సులు నడవకపోవడంతో ప్రైవేట్ వాహనదారులు ప్రయాణికులను దోచుకుంటున్నారు. డీజిల్, పెట్రోల్ చార్జీలు విపరీతంగా పెరిగినందున ఎక్కువ చార్జీలు వసూలు చేయక తప్పడం లేదని ప్రైవేట్ వాహనాల యజమానులు పేర్కొంటున్నారు. వసూళ్లు కాని కొన్ని ప్రాంతాల్లో ఆర్టీసీ అధికారులు బస్సులను నడిపిస్తుంటే, వసూలుకు ఢోకా లేని ప్రాంతాల్లో అధికారులు పల్లె వెలుగు వేయకపోవడం గమనార్హం. కెరమెరి నుంచి టోకెన్‌మోవాడ్ వరకు కొంత వరకు రోడ్డు బాగా లేకపోయినా, టోకేన్‌మోవాడ్ నుంచి జోడేఘాట్ వరకు తారు రోడ్డు ఉంది. అయినా ఆర్టీసీ అధికారులు బస్సులు నడపడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే బస్సు సౌకర్యం కల్పించాలని వేడుకుంటున్నారు.

రూ.150 తీసుకున్నారు..



పాటాగూడ క్రాస్‌రోడ్డు నుంచి కెరమెరికి 8 కిలోమీటర్ల దూరం ఉంటుంది. బస్సు సౌకర్యం లేకపోవడంతో నడవలేని పరిస్థితుల్లో ఉన్న నన్ను ఓ ప్రైవేట్ వాహనంలో దింపినందుకు రూ.150లు తీసుకున్నారు. బస్సు ఉంటే రూ.10లతో కెరమెరికి చేరేదాన్ని. బస్సులు నడవకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం.

– కోట్నాక రాంబాయి, చాల్‌బాడి

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



చెక్కులు పంపిణీ చేస్తున్న వైస్‌చైర్మన్ కృష్ణారావు

దహెగాం: పేద ప్రజల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు అన్నారు. శుక్రవారం మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పేద ప్రజల కష్టాలను చూసి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. మండలంలోని 48 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు మంజూరయ్యాయని పేర్కొన్నారు.

సర్పంచులకు ప్రశంసా అవార్డు పత్రాలు ప్రదానం..

అజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా మండలంలోని మూడు గ్రామ పంచాయతీలకు దీన్‌దయాళ్ ఉపాధ్యాయ పంచాయతీ వికాస్ పురస్కారాలు వరించాయి. ప్రథమ బహుమతి బీబ్రా గ్రామానికి రాగా, ద్వితీయ బహుమతి లగ్గాం, తృతీయ బహుమతి కోత్మీర్ గ్రామ పంచాయతీలను వరించాయి. పురస్కార అవార్డు పత్రాలను బీబ్రా సర్పంచ్ బండ క్రిష్ణమూర్తి, కోంద్ర అనూషగౌడ్‌లకు కృష్ణారావు అందజేశారు. సర్పంచులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ కంబగౌని సులోచన, జెడ్పీటీసీ తాళ్లపల్లి రామారావు, మండల రైతు సమన్వయ సమితీ కన్వీనర్ సంతోష్ గౌడ్, కాగజ్‌నగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిద్ధిఖీ, ఎంపీడీవో రాజేశ్వర్‌గౌడ్, డీటీ బక్కయ్య, సర్పంచ్ పుప్పాల లక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.

రైతుబీమా చెక్కు అందజేత

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ మండలం నామనగర్ గ్రామానికి చెందిన కొట్రంగి సోమయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, రైతుబీమా పథకం కింద ప్రభుత్వం మంజూరు చేసిన రూ.5 లక్షల విలువ గల చెక్కును జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావు చేతుల మీదుగా శుక్రవారం మృతుడి భార్య లక్ష్మికి అందజేశారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణ సర్కార్ రైతుబీమా పథకాన్ని ప్రవేశపెట్టి దేశంలోనే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కాసం శ్రీనివాస్, కో ఆప్షన్ సభ్యులు సిద్దిక్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ పంచాయతీలకు పురస్కారాలు



కాగజ్‌నగర్‌రూరల్: ఈజ్‌గాం సర్పంచ్ మల్లేశ్‌ను సన్మానిస్తున్న జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు



వాంకిడి: అవార్డులు అందుకున్న సర్పంచులు, కార్యదర్శులతో ఎంపీపీ, అధికారులు

రెబ్బెన: కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జాతీయ పురస్కారాలకు మండల స్థాయిలో ఎంపికైన గ్రామ పంచాయతీల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులను శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శాలువాలతో సన్మానించి ప్రశంసా పత్రాలు అందజేశారు. జాతీయ ఉపాధిహామీ, అంగన్‌వాడీ, ప్రభుత్వ పాఠశాలలతో పాటు 9 రకాల అంశాల్లో సర్వేలు నిర్వహించగా మండల స్థాయిలో ఉత్తమ పంచాయతీలుగా నంబాల, వంకులం, కైరిగాం పంచాయతీలు ఎంపిక కాగా ఎంపీడీవో కార్యాలయంలో ఆయా పంచాయతీల సర్పంచులు చెన్న సోమశేఖర్, జాదవ్ లలిత, మానెం కార్తీక్‌లతో పాటు పంచాయతీ కార్యదర్శులను సన్మానించారు. ఎంపీపీ సౌందర్య, జెడ్పీటీసీ సంతోష్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో అంజద్ పాషా పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని ఏడు గ్రామపంచాయతీలు ఉత్తమ పంచాయతీలుగా ఎంపిక కాగా ఆయా గ్రామాల సర్పంచ్‌లకు అవార్డులను శుక్రవారం అందజేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండలంలోని వల్లకొండ, ఈజ్‌గాం, వంజీరి, బసంతినగర్, దుర్గానగర్, నాగంపేట, బోడపల్లి గ్రామపంచాయతీల సర్పంచ్‌లను జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గౌరీశంకర్, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు సిద్దిక్, ఆయా గ్రామపంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

వాంకిడి: గ్రామాల్లో ప్రజలకు అందించే సేవలతోనే గ్రామపంచాయతీలకు ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని ఎంపీపీ ముండె విమలబాయి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పారిశుధ్యం, పచ్చదనం, ఫ్రెండ్లీ మహిళా వంటి పలు అంశాలను దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం జీపీలకు అందిస్తున్న 'దీన్ దయాల్ ఉపాధ్యాయ్ పంచాయత్ వికాస్ పురస్కార్' అవార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అవార్డులకు ఎంపికైన 17 గ్రామ పంచాయతీల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులను ఎంపీపీ, ఎంపీడీవో వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీవో శివకుమార్‌లు సత్కరించి, ప్రశంసా పత్రాలు అందజేశారు. మండలం నుంచి ధాబా, బంబార గ్రామ పంచాయతీలు జిల్లాస్థాయికి ఎంపికైనట్లు అధికారులు పేర్కొన్నారు.



నంబాల సర్పంచ్, కార్యదర్శులను సన్మానిస్తున్న ఎంపీపీ సౌందర్య, జెడ్పీటీసీ సంతోష్

క్లుప్తంగా

శనగ కొనుగోలు కేంద్రం ప్రారంభం



శనగ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోనప్ప

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో శుక్రవారం శనగ కొనుగోలు కేంద్రాన్ని సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల మేలు కోసం సీఎం కేసీఆర్ నేతృత్వంలోని సర్కార్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు, మార్కెట్ కమిటీ చైర్మన్ కాసం శ్రీనివాస్, సహకార చైర్మన్ ఉమామహేశ్వర రావులతో పాటు రైతులు పాల్గొన్నారు.

పిల్లలను బడికి పంపాలి

కెరమెరి: ప్రతీరోజు పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించాలని ఎంఎస్‌వో ఆడే ప్రకాశ్ అన్నారు. శుక్రవారం మండలంలోని భోలాపటార్ పాఠశాలను ఆయన సందర్శించారు. తక్కువ మంది విద్యార్థులు పాఠశాలకు హాజరు కావడంతో సర్పంచ్, గ్రామపటేల్‌తో కలిసి విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడారు. అనంతరం పాఠశాలలో కొనసాగుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. సమయపాలన పాటించాలని ఇన్‌టైంలో బయోమెట్రిక్ హాజరు వేయాలన్నారు.

తహసీల్దార్‌గా బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న తహసీల్దార్ ప్రహ్లాద్

దహెగాం: మండల తహసీల్దార్‌గా ప్రహ్లాద్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ తహసీల్దార్‌గా పని చేసిన మధూకర్ ఆసిఫాబాద్‌కు బదిలీ కాగా ఆయన స్థానంలో ఆసిఫాబాద్ నుంచి ప్రహ్లాద్ ఇక్కడికి వచ్చారు.

సిర్పూర్(టి) తహసీల్దార్‌గా రియాజ్ అలీ..



సన్మానిస్తున్న కార్యాలయ సిబ్బంది

సిర్పూర్(టి): మండల తహసీల్దార్‌గా రియాజ్ అలీ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో తహసీల్దార్‌గా పనిచేసిన జమీర్ హుస్సేన్ బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో రియాజ్ అలీ ఇక్కడికి వచ్చారు. రియాజ్‌అలీని తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది ఘనంగా సన్మానించారు.

క్షయ నిర్మూలనకు కృషి

కౌటాల: క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని మండల వైద్యాధికారి నవత అన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా శుక్రవారం కౌటాల పీహెచ్‌సీ వైద్య సిబ్బంది మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ తీశారు. ఆమె మాట్లాడుతూ టీబీ వ్యాధి లక్షణాలను ముందుగానే గుర్తిస్తే చికిత్స సులభమవుతుందన్నారు. రెండు వారాలకు పైబడి దగ్గు ఉండడం, రాత్రిపూట చెమట పట్టడం వంటి లక్షణాలు ఉంటే వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. అనంతరం క్షయ వ్యాధి నివారణపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ పావని, స్టాఫ్ నర్స్ వర్ష, అనిత పాల్గొన్నారు.

ఒత్తిడి జయిస్తేనే విజయం



విద్యార్థులకు పరీక్ష కిట్లు ఇస్తున్న ఎస్పీ సురేశ్

సిర్పూర్(టి): ఒత్తిడిని జయిస్తే పరీక్షల్లో విజయం సాధించవచ్చని ఎస్పీ సురేశ్‌కుమార్ సూచించారు. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో ఆయన శుక్రవారం పదో తరగతి విద్యార్థులకు పరీక్ష కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కృషి, పట్టుదల, సమయపాలన విజయానికి ముఖ్యసూత్రాలని పేర్కొన్నారు. తమ మీద తమకు నమ్మకం ఏర్పడినప్పుడే అనుకున్నది సాధించగలుగుతామని తెలిపారు. ప్రశాంత చిత్తం పరీక్షల్లో విజయం సాధించడానికి నాంది పలుకుతుందని చెప్పారు. పరీక్షల్లో ఎలాంటి జంకు లేకుండా పరీక్షలు రాయాలని తెలిపారు. పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్, సీఐ సాధిక్‌పాషా, ఎస్సై రమేశ్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే దేశాభివృద్ధి

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కోనప్ప



కౌటాల: పార్టీలో చేరిన యువకులతో కోనప్ప

కౌటాల: బీఆర్‌ఎస్ పార్టీతోనే దేశాభివృద్ధి సాధ్యమని సిర్పూర్(టి) ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కోనేరు కోనప్ప అన్నారు. స్థానిక ఎమ్మెల్యే నివాసంలో శుక్రవారం చింతలమానెపల్లి మండలంలోని కర్జవెల్లి గ్రామానికి చెందిన 50 మంది యువకులు, నాయకులు పార్టీలో చేరగా వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ప్రజల సమస్యలు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అంతకు ముందు శ్రీ సీతారామ కల్యాణ మహోత్సవం కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో ఎంపీపీలు బసర్కార్ విశ్వనాథ్, డుబ్బుల నానయ్య, మాజీ ఎంపీపీలు శ్రీనివాస్‌గౌడ్, డుబ్బుల వెంకన్న, ఆలయ కమిటీ అధ్యక్షుడు బట్టమేకల గట్టయ్య, పార్టీ మండల అధ్యక్షుడు ఆదే వసంత్‌రావు, నాయకులు తిరుపతి, బాపు, రవీందర్‌గౌడ్, శ్రీనివాస్, రాంచందర్, రమేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ

కాగజ్‌నగర్‌టౌన్: స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప చేతుల మీదుగా లబ్ధిదారులకు షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు, మార్కెట్ కమిటీ చైర్మన్ కాసం శ్రీనివాస్, కోఆప్షన్ సభ్యులు సిద్దిక్, తహసీల్దార్ ప్రమోద్ కుమార్ పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్‌లో..

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని ఎల్కపల్లి రైతు వేదికలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే కోనేరు కోనప్ప శుక్రవారం 32 మంది లబ్ధిదారులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఆడబిడ్డల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సరిత, సర్పంచ్‌లు జాజిమొగ్గ శ్రీనివాస్, దుర్గం రాజన్న, దేవాజీ, ఎంపీటీసీ రాజన్న, మండల కోఆప్షన్ సభ్యుడు సాజిద్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు చౌదరి తిరుపతి, బీఆర్‌ఎస్ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

చింతలమానెపల్లిలో..

చింతలమానెపల్లి: బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కల్యాణలక్ష్మి పథకం ఆడబిడ్డలకు వరమని సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద శుక్రవారం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. తహసీల్దార్ మష్కూర్ అలీ, ఎంపీపీ డుబ్బుల నానయ్య, జెడ్పీటీసీ డుబ్బుల శ్రీదేవి, ఎంపీడీవో మహేందర్, కాగజ్‌నగర్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ డోకె రాజన్న, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు డుబ్బుల వెంకన్న, నాయకులు నీలాగౌడ్, చాప్లె సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కౌటాలలో..

కౌటాల: మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో శుక్రవారం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఆడబిడ్డల పెళ్లిళ్లకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తుందన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా అవార్డులు అందుకున్న సర్పంచులు, అధికారులు, సిబ్బందిని ఆయన సన్మానించి ప్రశంసా పత్రాలు అందించారు. ఎంపీపీ విశ్వనాథ్, జెడ్పీటీసీ అనూష, ఇన్‌చార్జి తహసీల్దార్ భీమ్లా నాయక్, ఎంపీడీవో నస్రుల్లాఖాన్, ఏపీఎం వెంకటరమణ, ఏపీవో మౌనిక, సర్పంచులు మౌనిశ్, శ్రీనివాస్, రమేష్, సురేష్, రేణుక, ఎంపీటీసీలు శిరీష, మనీష్, రైతు బంధు సమితి మండల కన్వీనర్ మెర్పల్లి బ్రహ్మయ్య, పార్టీ మండల అధ్యక్షుడు ఆదే వసంత్ రావు, నాయకులు తిరుపతి, రవీందర్‌గౌడ్, జ్యోతిరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్ (టి)లో..

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని రైతువేదికలో శుక్రవారం సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. తెలంగాణ ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చునార్కర్ సువర్ణ, వైస్ ఎంపీపీ సత్యనారాయణ, మండల కోఆప్షన్ సభ్యుడు కిజర్ హుస్సేన్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పోషకాహారంపై వ్యాస రచన పోటీలు



పెంచికల్‌పేట్ :బహుమతులు అందజేస్తున్న హసీనా

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో పోషణ పక్షోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం విద్యార్థినులకు పౌష్టికాహారం ప్రాముఖ్యతపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా సూపర్‌వైజర్ హసీనా మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో ఎస్‌వో కవిత, అంగన్‌వాడీ టీచర్లు చంద్రకళ, శ్రీలత, సీఆర్‌టీలు స్నేహలత, శారద, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

కౌటాల: ప్రతీ ఒక్కరు పోషకాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షకీరాబేగం అన్నారు. పోషణ్ మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం కౌటాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. పోషకాహారంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పోషకాహారం తీసుకోవడంతోనే ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు జీజాబాయి, సుజాత, అనిత, సరోజ, విజయ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోజు కూలి రూ.600 చెల్లించాలి



మాట్లాడుతున్న ప్రధాన కార్యదర్శి ఉపేందర్

తిర్యాణి: నర్సరీల్లో పనిచేస్తున్న కూలీలకు రోజు కూలి రూ.600 చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని గోయోగాం ఫారెస్టు నర్సరీలో పనిచేస్తున్న కూలీలతో సమావేశం నిర్వహించి, వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఫారెస్టు నర్సరీల్లో పనిచేస్తున్న కూలీలు ఎన్నో ఏళ్లుగా చాలీచాలని వేతనాలు తీసుకుంటూ శ్రమ దోపిడీకి గురవుతున్నారన్నారు. వెంటనే కూలీల రేట్లు పెంచడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి సింగం మోగిలిగౌడ్, నర్సరీ కార్మికులు వసంత, సుజాత, సంతోశ్ తదితరులు ఉన్నారు.

ఎల్కపల్లిలో డీఎల్‌పీవో ఆకస్మిక తనిఖీ



పల్లెప్రకృతి వనం పరిశీలిస్తున్న సురేశ్‌బాబు

పెంచికల్‌పేట్: మండలంలోని ఎల్కపల్లి గ్రామపంచాయతీని డీఎల్‌పీవో సురేశ్‌బాబు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. అనంతరం గ్రామంలోని శ్మశానవాటిక, పల్లె ప్రకృతి వనం, నర్సరీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. పంచాయతీల్లో చేపట్టే పనులపై క్షేత్రస్థాయిలో అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎంపీడీవో గంగాసింగ్, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్,తదితరులు ఉన్నారు.

గిరిజన విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి



నృత్యం చేస్తున్న విద్యార్థులు

కౌటాల: గిరిజన విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కుమురం మాంతయ్య సూచించారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని మొగడ్‌దగడ్ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలలో 49వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గిరిజనశాఖ అధికారులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభించారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక నృత్యాలు ఆహుతులను అలరించాయి. ఏసీఎంవో పీ ఉద్ధవ్, ఏటీడీవో కుమార్, ఎంఈవో డీ సోమయ్య, సర్పంచ్ ఉర్వత్ జీజాబాయి, హెచ్ఎం నాందేవ్, పోచాని, నాయకులు వానుపటేల్, సుధాకర్, బాజీరావు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్: మండలంలోని ఎల్బూర్ ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం పాఠశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేశారు. ఎస్సై విజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల్లో ప్రతిభకు కొదువ లేదన్నారు. సర్పంచ్ రాజన్న, శ్రీనివాస్, మండల కోఆప్షన్ సభ్యుడు సాజిద్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అశోక్ కుమార్ పాల్గొన్నారు.

రేణుక కుటుంబాన్ని ఆదుకోవాలి

కెరమెరి: ప్రసూతి సమయంలో బిడ్డకు జన్మనిచ్చి మృతి చెందిన ఆగుర్‌వాడి గ్రామానికి చెందిన రేణుక కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఆదివాసీ మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోవ ఇందిరా అ న్నారు. శుక్రవారం మోడిలో ఆమె విలేకరులతో మాట్లాడారు. రేణుక మృతి చెంది ఐదు రోజులు గ డుస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించడం లేదన్నారు. ఆదివాసీ యువతిని పెళ్లి పే రుతో గర్భవతిని చేసి మృతికి కారణమైన జాటోత్ రమేశ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. శ్రీదేవి, పార్వతి, యశోద ఉన్నారు.

సైన్స్ కార్నివాల్‌లో పాల్గొన్న డీఈవో

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని డీఆర్‌సీ భవనంలో 6వ తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థులకు శుక్రవారం క్రేజీ చిల్డ్రన్స్ సైన్స్ కార్నివాల్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా విద్యాశాఖ అధికారి పార్శి అశోక్ పాల్గొని పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు సైన్స్ మ్యాజిక్ షో ద్వారా మూఢ నమ్మకాల నివారణపై వివరించారు.

భక్తిశ్రద్ధలతో పల్లకి ఊరేగింపు



పల్లకి ఊరేగిస్తున్న భక్తులు

కౌటాల: మండలంలోని వీర్దండి గ్రామ సమీపంలోని పెన్‌గంగా నది ఒడ్డున గల బీర్య హనుమాన్ మందిర్ ఆధ్వర్యంలో భక్తులు శుక్రవారం శ్రీరాముని పల్లకిని భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. ఆలయ అర్చకులు మారుతి మహరాజ్ ఆధ్వర్యంలో మండలంలోని మొగడ్‌దగడ్, పార్డీ, వీరవెల్లి గ్రామాల్లో పల్లకి ఊరేగించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు పర్చాకే బండు, సభ్యులు పెందోర్ కాళిదాస్, ఆత్మరాం, భక్తులు పాల్గొన్నారు.

బహుళ అంతస్తుల్లో.. లగ్జరీ అపార్ట్‌మెంట్



రక్ష హోమ్స్ అపార్ట్‌మెంట్స్

పాతమంచిర్యాల: పట్టణంలోని శ్రీనివాసగార్డెన్ వద్ద రక్ష హోమ్స్ పేరుతో అన్ని సౌకర్యాలతో బహుళ అంతస్తుల్లో నిర్మించిన గేటెడ్ కమ్యూనిటీ లగ్జరీ అపార్ట్‌మెంట్స్‌లో మూడు పడకల గదులు పలువురిని ఆకట్టుకుంటున్నాయి. ఈ సందర్భంగా రక్ష హోమ్స్ ఎండీ కై లాస్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో మొదటిసారి గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్‌మెంట్‌ను కాలుష్య రహితంగా, పచ్చదనం ఉట్టిపడేలా నిర్మించామన్నారు. కార్పొరేట్ స్థాయిలో ఆధునిక హంగులతో చిన్న పిల్లలకు ఆటస్థలం, పార్కు, స్విమ్మింగ్‌పూల్, క్లబ్ హౌజ్‌తోపాటు పురుషులు, మహిళలకు ప్రత్యేక జిమ్, కాన్ఫరెన్స్ హాలు నిర్మించినట్లు తెలిపారు. 24 గంటల జనరేటర్ సౌకర్యం, అపార్ట్‌మెంట్ చుట్టూ సోలార్ ఫెన్సింగ్, కంపోడ్‌వాల్, సీసీ కెమెరాలు అమర్చామని అన్నారు. మై గేట్ యాప్, విశాలమైన పార్కింగ్, ప్రకృతి రమణీయంగా నిర్మించామన్నారు. ఈస్ట్, వెస్ట్ ఫేసింగ్ 1600 చదరపు అడుగుల ప్లాట్లు కస్టమర్లకు సరసమైన ధరల్లో లభిస్తాయన్నారు. క్లియర్ టైటిల్ స్థలంలో నిర్మించిన ప్లాట్ల కొనుగోలుకు అన్ని ప్రముఖ బ్యాంకుల నుంచి లోన్లు లభిస్తాయన్నారు.